# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 27-04-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ మళ్లీ అధికారంలోకి వస్తే విశాఖ నుంచి పరిపాలన చేస్తామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి తెలిపారు.
- ❖ పట్టణాల్లో పోలింగ్ శాతం పెంచేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా పేర్కొన్నారు.
- ❖ సామాజిక పెన్షన్లను లబ్దిదారులకు ఇళ్ళ వద్దనే పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టాలని కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.
- ❖ టీడీపీ అధికారంలోకి వస్తే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తామని పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు.
- ❖ రానున్న నాలుగు రోజుల్లో రాష్ట్రంలో పలుచోట్ల అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని భారత వాతావరణ శాఖ తెలిపింది.

======================

రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వస్తే విశాఖ నుంచి పరిపాలన చేస్తామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి తెలిపారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో 2024 ఎన్నికలకు సంబంధించిన వైసీపీ ఎన్నికల ప్రణాళికను ఈ రోజు ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రానికి విశాఖను అభివృద్ధి ఛోదక శక్తిగా తీర్చి దిద్దుతామని హామీ ఇచ్చారు. అదే విధంగా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని నిర్దిష్ట కాలపరిమితిలో పూర్తి చేస్తామని తెలిపారు. కాగా, రెండు విడతల్లో సామాజిక పెన్షన్‌ను 3 వేల 500 దాకా పెంచడం, వైఎస్సార్ చేయూత పథకం ద్వారా 4 విడతల్లో అందిస్తున్న 75 వేల రూపాయల నుంచి రానున్న అయిదేళ్లలో లక్షా 50 వేలకు ఆ మొత్తాన్ని పెంపు చేయడం, వైద్యం, ఆరోగ్యశ్రీ విస్తరణ, నాలుగు దఫాల్లో ఈబీసీ నేస్తం 45 వేల నుంచి లక్షా 5 వేల రూపాయలకు పెంపు, వైస్సార్ రైతు భరోసా 13 వేల 500 నుంచి 16 వేల రూపాయలకు పెంపు, కౌలు రైతులకు కూడా రైతు భరోసా వర్తింపు వంటి అనేక హామీలు ఎన్నికల ప్రణాళికలో ఉన్నాయి.

======================

రాష్ట్రంలో ఈసారి పట్టణాలలో ఉండే ఓటర్లపై ఎక్కువ దృష్టి పెడుతున్నామని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. పట్టణ ప్రాంతాలలో ఓటింగ్ శాతం పెరగాలని ఆయన అన్నారు. క్రమబద్ధమైన ఓటర్ల విద్య ఎన్నికల భాగస్వామ్యం (స్వీప్) కార్యక్రమంలో భాగంగా గుంటూరులో ఈ రోజు నిర్వహించిన 3 కిలోమీటర్ల నడక కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ, రాష్ట్రంలోని 18 ముఖ్య పట్టణాలలో ఓటింగ్ శాతం 68 కన్నా తక్కువగా ఉందని వెల్లడించారు. పరిశ్రమలలో పనిచేసే వారికి పోలింగ్ రోజున పెయిడ్ హాలిడే గా ప్రకటించామని ముఖేష్ కుమార్ మీనా పేర్కొంటూ....

(వాయిస్ 26 సెకన్లు)

======================

రాష్ట్రంలో సామాజిక పెన్షన్లను లబ్దిదారులకు ఇళ్ళ వద్దనే పంపిణీ చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలని కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. పెన్షన్ సహా, నగదు బదిలీ పథకాలకు సంబంధించి మార్చి 30న జారీ చేసిన మార్గదర్శకాలను పాటించాలని స్పష్టం చేసింది. ఎన్నికల నిబంధనలు అమలులో ఉన్న నేపథ్యంలో లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని పేర్కొంది. అదే విధంగా ఇంటింటికీ పెన్షన్లను పంపిణీ చేసేందుకు వాలంటీర్లకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వ ఉద్యోగులను వినియోగించుకోవాలని సూచించింది. శాశ్వత ఉద్యోగులు, ఎలక్ట్రానిక్ విధానాల ద్వారా ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంపిణీ చేయవచ్చని గత మార్గదర్శకాల్లోనే సూచించామని ఈసీ గుర్తు చేసింది.

======================

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే మెగా డీఎస్సీ కోసం నోటిఫికేషన్ ఇస్తామని ఆ పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరులో ఈ రోజు నిర్వహించిన ఎన్నికల బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తామని అన్నారు. పేదల కోసం ఆరు సంక్షేమ పథకాలను అమలు చేస్తామని చంద్రబాబు తెలిపారు.

======================

రాష్ట్రంలో పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. అనేక జిల్లాలలో 42 నుండి 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ పరిస్థితి నెలాఖరు వరకు కొనసాగనుందని భారత వాతావరణ శాఖ తెలిపింది. అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో రాష్ట్రంలో వడగాల్పుల తీవ్రత రోజు రోజుకు తీవ్రమవుతోందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. కాగా, ఈ రోజు 64 మండలాల్లో తీవ్ర వడగాల్పులు 183 మండలాల్లో వడగాల్పులు వీస్తాయనీ, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ సూచించింది. రా బోయే కొద్ది రోజుల పాటు ఇదే పరిస్థితి ఉంటుందని ప్రజలు అత్యవసర సమయాలలో తప్ప పగటి పూట బయట తిరగరాదని పేర్కొంది.

విరామం

======================

లోక్ అదాలత్ కార్యక్రమాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ కోరారు. చిత్తూరు పట్టణంలో నూతనంగా నిర్మించిన ప్రధాన న్యాయస్థాన భవన సముదాయాలను సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ ఎస్.వి.ఎన్.భట్టి, రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాగూర్ ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా జస్టిస్ బి.ఆర్.గవాయ్ మాట్లాడుతూ, పెండింగ్ కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ సరైన వేదిక అని అన్నారు.

=======================

తెలుగుదేశం పార్టీ కూటమి అధికారంలోకి వస్తే రాజమహేంద్రవరాన్ని టూరిజం హబ్ గా తీర్చిదిద్దుతామని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు, లోక్ సభ అభ్యర్థి దగ్గుబాటి పురంధేశ్వరి తెలిపారు. ఈరోజు రాజమహేంద్రవరంలోని పలు డివిజన్లలో ఆమె రోడ్ షో నిర్వాహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రంలో టీడీపీ - జనసేన - బీజేపీ కూటమిని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. పెరిగిన నిత్యావసర ధరలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆమె తెలిపారు.

=======================

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రత్యేక హోదాను రాష్ట్రానికి సాధిస్తామని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తెలిపారు. అనకాపల్లి జిల్లాలోని పాయకరావుపేటలో ఈ రోజు జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆమె మాట్లాడుతూ, రాష్ట్రానికి ప్రత్యేక హొదా వచ్చి ఉంటే యువతకు ఉద్యోగాలు వచ్చేవని తెలిపారు.

=======================

ప్రజా ధనంతో నిర్మించిన ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని శ్రీకాకుళం సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు అన్నారు. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా సిపిఎం నాయకులు ఈ రోజు ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

=======================

అనకాపల్లి జిల్లాలో ఈరోజు జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. జిల్లాలోని నక్కపల్లి మండలం వెదుళ్లపాలెం వద్ద ఒక కారు అదుపు తప్పి లారీని ఢీ కొట్టింది. దీంతో కారులో ఉన్న ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. మృతులు విశాఖనగరం గోపాలపట్నం వాసులుగా గుర్తించారు. స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

=======================

విశాఖలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామి వారి దేవస్థానంలో మే 10వ తేదీన శ్రీ స్వామి వారి చందనోత్సవం నిర్వహిస్తున్నట్లుగా దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. నిజరూప దర్శనం సందర్భంగా జరిగే సహస్రఘటాభిషేకానికి సంబంధించి తీర్థ కైంకర్యం చేసేందుకు శ్రీ వైష్ణవ సంప్రదాయమునకు చెందిన వారు మే 5 లోగా దేవస్థాన కార్యాలయానికి దరఖాస్తులు చేసుకోవాలని అధికారులు కోరారు.

=======================

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా చూసేందుకు సమర్థ్ పేరుతో తీసుకుని వచ్చిన మొబైల్ యాప్ ఉపయోగపడుతుందని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా అన్నారు. ఈ యాప్ ని రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల ఎస్పీలు, సీపీలు, సెక్టర్ ఆఫీసర్లు వినియోగించుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ యాప్ ద్వారా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల లొకేషన్లను సులభంగా గుర్తించగలమని తెలిపారు.

=======================

కాలానుగుణంగా ప్రబలే అనారోగ్య సమస్యల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పార్వతీపురం మన్యం జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు కోరారు. గరుగుబిల్లి మండలం ఎస్.ఆర్ పేట గ్రామంలో ఈరోజు ఆకస్మికంగా పర్యటించారు. జ్వర లక్షణాలతో ఉన్న వారి వివరాలను సేకరించాలని ఈ సందర్భంగా వైద్య సిబ్బందిని కోరారు.

=======================

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. టోకెన్లు లేని భక్తులకు 18 గంటల్లో సర్వదర్శనం కలుగుతుందని తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు వివరించారు.

=======================

=======================